క్లుప్తంగా

అవసరమైన నైపుణ్యాలను పెంచుకోవాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకున్నప్పుడు మెరుగైన ఉపాధి అవకాశాలను పొందుతారని టెక్ మహీంద్రా సంస్థ టాలెంట్ అక్విజిషన్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి వీరంరెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో 'కెరీర్ పురోగతి – పరిశ్రమ సంసిద్ధత' అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల అవసరాలు, ఆయా రంగాల్లో చోటు చేసుకున్న మార్పులు, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వాటి అవసరాలు, మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ప్రధానంగా విద్యార్థులు ఏ రంగంలో పయనించాలని నిర్ణయించుకున్నారో అందులో ఉన్న అంశాలపై లోతైన అవగాహన పెంచుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులను వారివారి రంగాల్లో తీర్చిదిద్దటానికి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం శ్రీనివాసరెడ్డి విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శరవణకుమార్ అధ్యక్షత వహించారు. వివిధ సంస్థల ప్రముఖులు వినయ్‌రత్నం, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తన భర్త తనను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడంటూ గొల్లపూడి మహేంద్ర నగర్ జైన్ కాలనీకి చెందిన సిద్ధి జైన్ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు... గుజరాత్‌కు చెందిన దర్పణ్ జైన్, సిద్ధి జైన్ భార్యభర్తలు. 17 ఏళ్ల కిందట విజయవాడకు వచ్చారు. వీరికి ఒక బాబు సంతానం. గత కొంత కాలంగా దర్పణ్ జైన్ భార్య సిద్ధి జైన్‌ను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇంటి నుంచి వెళ్లిపోవాలని కొడుతున్నాడు. గత నెల 28న కుమారుడి సమక్షంలోనే ఇంటి నుంచి వెళ్లిపోవాలని దాడి చేశాడు. పెద్ద మనుషుల్లో పెట్టినప్పటికీ మార్పు రాకపోవడంతో భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో సుబ్బారావు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని పాఠశాలలను జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు శుక్రవారం తనిఖీ చేశారు. సూర్యారావుపేటలోని ఎస్కేఆర్ఎంఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌కు శుక్రవారం మధ్యాహ్నం వెళ్లి విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల హ్యాండ్‌బుక్‌లను పరిశీలించి పాఠ్యాంశాల బోధన, ఇతర అంశాలపై చర్చించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గుర్తు తెలియని ఆటో బైక్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భవానీపురం పోలీసులు తెలిపిన వివరాలు.. గొల్లపూడి మైలురాయి సెంటర్‌కు చెందిన పెదవల్లి వెంకటేశ్వరరావు రాజీవ్‌గాంధీ హోల్ సేల్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. తన పెద్ద కుమారుడు యశ్వంత్‌తో కలిసి షాపు నుంచి స్కూటీపై ఇంటికి వస్తుండగా కనకదుర్గా ఫ్లైఓవర్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టింది. ఈ ఘటనలో యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంకటేశ్వరరావుకు చేతులు, కాళ్లు, ముఖంపై గాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుడు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటి వారిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అదనపు కట్నం కోసం వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ ఈద్గా మహల్ రోడ్డులో పట్నాల భ్రమరాంబిక, రవిరాజు భార్యభర్తలు. వీరికి 2022లో వివాహం కాగా, వివాహ సమయంలో రూ.1.10 కట్నం, ఇతర లాంఛనాలు ఇచ్చారు. కొంత కాలంగా అత్త గోవిందమ్మ, ఆడపడుచు లాలస దేవి వేధింపులకు గురి చేయసాగారు. భ్రమరాంబిక జాతకం బాగోలేకనే లాలసదేవి వివాహం కావడం లేదని వేధించసాగారు. పుట్టింటికి వెళ్లి అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో బాధితురాలు పుట్టింటికి వచ్చేసింది. అత్తింటి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు.. రోడ్లపై పాదచారులు

- రైల్వేస్టేషన్ రహదారిలో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు
- రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని రైల్వే అధికారులు



స్టేషన్ రోడ్డులోని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన టిఫిన్ బండి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రతి రోజు వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే విజయవాడ రైల్వేస్టేషన్ పరిసరాలు ఆక్రమణలకు గురవడంతో రాకపోకలకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు ప్రధాన ప్రవేశ మార్గం, ఏలూరు లాకుల నుంచి స్టేషన్‌కు వెళ్లే రోడ్డు, వీఎంసీ వెహికల్ డిపో రోడ్ల మీదుగా స్టేషన్‌కు చేరుకునేందుకు ఎక్కువ సంఖ్యలో కార్లు, ద్విచక్ర వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అటువంటి ఈ రోడ్లపై సురక్షితంగా నడక మార్గంలో నడిచే ప్రయాణికులు, పాదచారుల కోసం రైల్వే అధికారులు ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారు. అయితే కొందరు వ్యాపారులు తమ స్వార్థంతో ఫుట్‌పాత్‌లను యథేచ్ఛగా ఆక్రమించుకుని తమ వ్యాపారాలకు ఉపయోగించుకోవడంతో పాదచారులు, నడక మార్గంలో వెళ్లే ప్రయాణికులు తమ లగేజీలతో ప్రమాదకరంగా రోడ్లపైన వాహనాల మధ్య నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజు విధులకు హాజరయ్యేందుకు ఆయా మార్గాల ద్వారా రాకపోకలు సాగిస్తున్న రైల్వే అధికారులకు ఈ ఆక్రమణలు కనిపించకపోవడం గమనార్హం.

అరకొర తనిఖీలతో సరి...

ప్రయాణికుల ఆరోగ్య భద్రత దృష్ట్యా రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే ప్రాంగణంలో అనుమతులు లేకుండా బయట వ్యక్తులు ఆహార విక్రయాలు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. కాని అవి ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు జరగటం లేదు. ఫుట్‌పాత్‌లపై వెలసిన కొన్ని దుకాణాలలో నాణ్యత, పరిశుభ్రత లేకుండానే తయారు చేస్తున్న టిఫిన్, భోజనం, బిర్యాని, సొంతంగా ప్యాక్ చేసిన పానీయాలను ప్రయాణికులకు విక్రయిస్తున్నారు. ఇటువంటి ఆహారాన్ని తినడం వలన ప్రయాణికుల ఆరోగ్యాలకు హాని జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి దుకాణాలపై రైల్వే కమర్షియల్ అధికారులు ఇటీవల తనిఖీలు చేసి ఫుట్‌పాత్‌ల నుంచి తొలగించాల్సింది పోయి పెనాల్టీలు విధించి చేతులు దులుపుకోవడంతో ఫుట్‌పాత్‌లు యథావిధిగా అక్రమ వ్యాపారుల అధీనంలోనే ఉండిపోయాయి.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు...



కరుణా హోటల్ వద్ద ఫుట్‌పాత్ ఆక్రమణ

ఏలూరు లాకులు, వీఎంసీ వెహికల్ డిపో రోడ్డు, స్టేషన్ తూర్పు ప్రధాన రహదారి, రైల్వే హాస్పిటల్ తదితర ప్రాంతాలలో పాదచారులు నడవటానికి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు నడిచేందుకు కాదు కదా కనీసం చూడటానికి కూడా వీలు లేకుండా కొందరు వ్యాపారులు పూర్తిగా ఆక్రమించుకుని తమ అడ్డాగా మార్చుకున్నారు. దీంతో ప్రయాణికులు ప్రమాదభరితంగా రోడ్డు మీద నుంచే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఆయా రోడ్లలో ఎక్కడ చూసినా బడ్డీ కొట్లు, టిఫిన్ స్టాల్స్, కిళ్లీకొట్లు, పండ్ల వ్యాపారులు ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రైల్వే అధికారులు పట్టించుకోకపోవడంతోనే స్టేషన్ పరిసరాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో రైల్వేస్టేషన్‌లోకి రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నట్టు మా దృష్టికి వచ్చింది. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలోని ఫుట్‌పాత్‌లు పాదచారుల కోసం ఏర్పాటు చేసినవి. వీటిని ఆక్రమించుకుని వ్యాపారాలు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం. దీనిపై స్థానిక పోలీసులు, ఆర్‌పీఎఫ్ సంయుక్త కార్యాచరణతో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఫతే అలీబేగ్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల



భవానీపురం(విజయవాడపశ్చిమ): బిడ్డ పుట్టిన అర్ధ గంటలోపు తల్లి పాలు ఇవ్వడం ద్వారా శిశువులో రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు మెదడు ఎదుగుదలకు దోహదం చేస్తుందని ఐసీడీఎస్ సెక్టార్–2 సూపర్‌వైజర్ ఎస్కే జహీదా బేగం అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం 44వ డివిజన్ పరిధిలోని రామరాజ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె తల్లి పాల విశిష్టత గురించి వివరిస్తూ బిడ్డకు తల్లి పాలు అమృతంలా పని చేస్తాయని చెప్పారు. తల్లి పాలు తాగిన శిశువుల్లో యాంటీబాడీస్ వృద్ధిచెంది ఇన్‌ఫెక్షన్లు, నిమోనియా, డయేరియా వంటి వ్యాధులు సోకవని అన్నారు. ముర్రుపాలు బిడ్డలో వ్యాధి నిరోధక శక్తిని పెంచటంతోపాటు శిశువు జీర్ణాశయ అభివృద్ధికి దోహదపడే పదార్థాలు, విటమిన్–ఎ పుష్కలంగా లభిస్తాయని చెప్పారు. బిడ్డకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువని తెలిపారు. తొలుత తల్లి పాలు ఆవశ్యకతపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకట రమణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ నిరంతర పక్రియ

డీఆర్ఎం మోహిత్ సోనాకియా



క్లాక్ టవర్ వద్ద అధికారులు, సిబ్బందితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్కరోజు చేసేది కాదని అది నిరంతర పక్రియగా చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ డీఆర్ఎం మోహిత్ సోనాకియా అన్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ దిశగా శుక్రవారం స్వచ్ఛత అభియాన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన డీఆర్ఎం ముందుగా అధికారులు, సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, పారిశుద్ధ్య కార్మికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో అన్ని కార్యకలాపాల్లోనూ స్వచ్ఛతను పాటించే దిశగా ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం క్లాక్ టవర్ వద్ద మొక్కలు నాటారు. స్టేషన్‌లో పర్యావరణ పరిరక్షణపై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. అనంతరం క్లాక్ టవర్ నుంచి స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎడ్విన్, సీనియర్ డీఈహెచ్ఎం ఎం.వంశీకాంత్, పలు బ్రాంచ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విప్లవాత్మక ఆటో మ్యుటేషన్ సేవలకు శ్రీకారం

కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటో మ్యుటేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో మ్యుటేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని.. ఇదో విప్లవాత్మక మార్పు అని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మ్యుటేషన్ అవుతున్న ప్రక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్య లక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ ప్రక్రియను స్టెప్ – 1 మొదలు స్టెప్ – 7 వరకు చివరగా మ్యుటేషన్ సర్టిఫికేట్ జనరేట్ అయ్యేంత వరకు ప్రక్రియను పరిశీలించారు. ఈ ప్రక్రియ మొత్తం అరగంటలో పూర్తి చేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్ర లబ్ధిదారుకు మ్యుటేషన్ సర్టిఫికేట్ అందజేశారు.

పారదర్శకంగా సేవలు

అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ కొత్త విధానంలో ఒకేరోజు ఒకే చోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్ జరుగుతుందని చెప్పారు. మునిసిపల్ డేటా బేస్‌లో ఆటోమేటిక్‌గా యజమాని పేరు మారిపోతుందని వివరించారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతాయన్నారు. రిజిస్ట్రేషన్, మునిసిపల్ డిపార్టుమెంట్ల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ పట్టణ డిజిటల్ పాలనలో ఇదొక మైలురాయి అన్నారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ వీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ ఆంజనేయరెడ్డి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులు స్వచ్ఛంద సేవా సంస్థలు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని 40వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి అన్నారు. నగరంలోని జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం భవానీపురంలోని శ్రీకనుమర్లపూడి సుబ్బారావు మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయరెడ్డి మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఏడాది కాలంలోనే మంచి పేరు సంపాదించుకున్న జయ భారత్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు అభినందనీయులన్నారు. వృద్ధులు, అన్నార్తులతోపాటు పేద విద్యార్థులకు వారు అందిస్తున్న చేయూత హర్షణీయమన్నారు. ఈ పాఠశాలలో బెంచీల కొరతతో చిన్నారులు కింద కూర్చోవల్సి వస్తున్నందున ట్రస్ట్ నిర్వాహకులు బెంచీలు ఏర్పాటు చేయాలని కోరారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ శిఖినం శ్రీనివాసరావు (రైల్వే శ్రీనివాస్) మాట్లాడుతూ సంస్థ ఏర్పాటు చేసిన ఏడాది కాలంలోనే 110 సేవా కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. ముఖ్యంగా గత ఏడాది వచ్చిన బుడమేరు వరదల సమయంలో ఎంతో మంది బాధితులకు వివిధ రూపాల్లో సేవలు అందించామని తెలిపారు. విజయవాడ నగరంలో ఒక వృద్ధాశ్రమాన్ని నెలకొల్పాలన్నది ట్రస్ట్ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రెజరర్ జ్యోతి, సభ్యులు శ్రావ్య, స్పందన, ఆనంద్, శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

907 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ స్వాధీనం

రూ.3.50 లక్షల జరిమానా



ఒన్‌టౌన్‌లోని ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న వీఎంసీ ప్రజారోగ్య విభాగం అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నిషేధంలో ఉన్న సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ విక్రయించిన వ్యాపారస్తులపై దాడులు నిర్వహించి వారి వద్ద 908.83 కేజీల సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా వ్యాపారస్తులకు రూ.3.50 లక్షల జరిమానా విధించామని వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు ఆధ్వర్యంలో మూడు సర్కిళ్ల పరిధిలో జూలై 25 నుంచి జూలై 31 వరకు ఈ దాడులు జరిగాయని పేర్కొన్నారు. సర్కిల్–1లో 3 టీములు, సర్కిల్–2 లో 3 టీములు, సర్కిల్– 3లో 4 టీములు ఈ తనిఖీలు నిర్వహించాయని తెలిపారు.

కార్పొరేషన్‌లోనూ తనిఖీలు

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా విజయవాడ నగరపాలక సంస్థ ఉండాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆ మేరకు వీఎంసీ ప్రధాన కార్యాలయంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కచ్చితంగా నిషేధించాలని సిబ్బందికి అవగాహన కల్పించారు. విజయవాడ నగరవాసులు బయోడీగ్రేడబుల్ కవర్లు మాత్రమే వాడాలని చెప్పారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ అమ్మకంపై మొదటిసారి హోల్‌సేల్ షాప్‌లపై జరిమానా విధిస్తామని, రెండోసారి దానికి రెట్టింపు, మూడోసారి షాపు లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

బైక్ ఢీకొని ఆర్ఎంపీకి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బైక్ ఢీకొని ఆర్ఎంపీకి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన డి.జగన్నాధరావు వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. గురువారం సాయంత్రం లంబాడీపేట సాయిరాం థియేటర్ ప్రాంతానికి వెళ్లిన జగన్నాధరావు పని ముగించుకుని రోడ్డుపై నిలబడ్డాడు. ఇంతలో పాలప్రాజెక్టు వైపు నుంచి చిట్టినగర్ వైపు వెళుతున్న బైక్ వేగంగా వచ్చి ఆయన్ను ఢీ కొట్టింది. దీంతో జగన్నాధరావుకు రెండు కాళ్లకు గాయాలు కాగా స్థానికులు 108 వాహనంపై విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ సుహాసిని తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వాస్పత్రి ప్రసూతి విభాగంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పుట్టిన అర్ధగంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టించాలన్నారు. బిడ్డకు వయస్సు ఆరు నెలలు వచ్చే వరకూ తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ తల్లిపాల ఆవశ్యకతపై వారం రోజుల పాటు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రసూతి విభాగంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను తెలిపారు. కార్యక్రమంలో పిడియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ పరుచూరి అనిల్‌కుమార్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ కేశవచంద్ర, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ పద్మావతి తదతరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు పండ్లు, పోషక ఆహారం పంపిణీ చేశారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందడి



ప్రత్యేక అలంకారంలో పద్మావతిదేవి



మహాలక్ష్మీ అమ్మవారికి విశేష అలంకరణ



విజయదుర్గా అమ్మవారు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని పాతబస్తీలోని ఆలయాల్లో శుక్రవారం సందడి నెలకొంది. ఆయా ఆలయాల్లో ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. అందులోనూ స్వాతి నక్షత్రం రావటంతో మంచి రోజు అని పండితులు పేర్కొంటున్నారు. ప్రధానంగా పాతబస్తీలోని పురాతనమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో పద్మావతి అమ్మవారికి పూలంగిసేవను నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి అర్చనలను నిర్వహించారు. మరో పురాతన ఆలయమైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భ్రమరాంబ అ మ్మవారికి విశేష అర్చనలను నిర్వహించారు. ఉపాలయమైన శ్రీ నరసింహస్వామి వారికి పలు ప్రత్యేక పూ జలు నిర్వహించారు. కొత్తగుళ్ల ప్రాంగణంలో ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలోనూ విశేషంగా పూజలు నిర్వహించారు. బ్రాహ్మణవీధిలోని శ్రీ చదు ను మహాలక్ష్మమ్మ దేవస్థానం, కొత్తపేట గంగానమ్మ దేవస్థానం తదితర ఆలయాల్లోనూ శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని చిట్టినగర్ పరిధిలోని పలు ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు దర్శించుకుని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా, సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థాన కమిటీకి చెందిన మరుపిళ్ల హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజయదుర్గా ఆలయంలో...

భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చకులు యాగాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజలు నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

పోలవరం - బనకచర్ల ప్రాజెక్టు లోపభూయిష్టం

- ఈనెల 4 నుంచి ప్రాజెక్టుల సందర్శన
- ఆలోచనపరుల వేదిక

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత లోపభూయిష్టమైన, రాష్ట్ర నీటి హక్కులకు ప్రమాదం తెచ్చిపెట్టే, కరవు పీడిత రాయలసీమకు తీవ్ర హానికరమైన పోలవరం – బనకచెర్ల భారీ ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించిందని ఆలోచనపరుల వేదిక విమర్శించింది. ఈ పథకాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆలోచనపరుల వేదిక ప్రతినిధులు టి. లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీ ప్రసాద్, ఏబీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. పోలవరం బనకచర్ల అనుసంధాన పథకాన్ని తెలంగాణ రాజకీయ ఆయుధంగా మలుచుకుని ఏపీ నీటి హక్కులపై ముప్పేట దాడి చేస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా, గోదావరి నదీ జలాలపై రాజకీయ ప్రేరేపిత వివాదం తీవ్ర స్థాయిలో కొనసాగుతోందన్నారు. ట్రిబ్యునల్ తీర్పులను, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఖాతరు చేయకుండా తెలంగాణలో నీళ్ల రాజకీయాన్ని తారస్థాయికి తీసుకెళ్లారన్నారు. తెలంగాణ ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ ద్వారా అసత్యాలతో ఏపీ నీటి హక్కులపై దాడి చేసినా కూటమి ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని ప్రాజెక్టుల పర్యటన చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 4న పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, 5న శ్రీశైలం జలాశయం ఆధారంగా నిర్మించిన మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాలు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్, వెలుగోడు రిజర్వాయర్‌ను సందర్శిస్తామని తెలిపారు. ఈనెల 6న శ్రీశైలం కుడి బ్రాంచి కాలువ (ఎస్సార్‌బీసీ) ప్రధాన రిజర్వాయర్‌ను సందర్శించనున్నట్లు తెలిపారు. అనంతరం కర్నూలులో రైతులు, పౌర సమాజంతో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

30 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 30 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 30 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదుచేశారు. 30 మందిని కోర్టులో హాజరుపరచగా, ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి లెనిన్‌బాబు ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున, మిగిలిన 27 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



గ్రీన్ మిషన్ ర్యాలీలో విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై అవగాహన పెంపొందించేందుకు గ్రీన్ ఇండియా మిషన్ పేరుతో భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా నిర్వహించిన ఈ ర్యాలీ స్కూల్ వద్ద నుంచి ప్రారంభమై స్వాతి సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ మనందరి సామాజిక బాధ్యత అన్నారు. వాతావరణంలో వస్తున్న హానికరమైన మార్పుల ప్రభావాన్ని తగ్గించాలంటే ప్రతి ఒక్కరూ తాము నివసిస్తున్న ఇంటి ఆవరణలో ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, డీన్ రంగారావు, సీ–బ్యాచ్ ఇన్‌చార్జ్ రాము, కో ఆర్డినేటర్ సీహెచ్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.